

ఆపన్నులకు అన్నదానం

ఒంగోలు జీజీహెచ్‌లో రోగుల బంధువులకు సత్యసాయి ప్రేమ ట్రస్టు, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో రెండు పూటలా భోజనం పెడుతున్నారు - 8లో..



ఆటో డ్రైవర్ నిజాయితీ

ఆటోలో మరిచిపోయిన బంగారు ఆభరణాలు, నగదు తిరిగి ఇచ్చి డ్రైవర్ అందరి మన్ననలు పొందాడు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29/21

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొగమంచు ఎక్కువగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

రూరల్ సీఐ బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీచేశారు. ఒంగోలు రూరల్ సీఐగా పనిచేస్తున్న వి.శ్రీనివాసరెడ్డిని తిరుపతి జిల్లా నాయుడుపేటకు బదిలీ చేశారు. బాపట్ల జిల్లా టిసూండూరు సీఐగా పనిచేస్తున్న ఏ రాజమోహన్‌రావును ఒంగోలు రూరల్‌గా సీఐగా నియమించారు.

10 నుంచి మెగా క్రికెట్ టోర్నీ

సీఎస్‌పురం(పామూరు): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డీజీపేటలో ఈ నెల 10 నుంచి ప్రకాశం, నెల్లూరు జిల్లా స్థాయిలో క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆలూరి బాలకొండయ్య, షేక్.అబ్దుల్‌ఖాదర్ తెలిపారు. క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 9వ తేదీ సాయంత్రం లోగా ఎంట్రీఫీజు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,016, రెండో బహుమతి రూ.15,016, తృతీయ బహుమతి రూ.7,516 అందజేస్తామన్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9960049041, 8008339581 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సంక్రాంతి సంబరాలకు భారీ ఏర్పాట్లు

- 10న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన



పనులు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు 10,11 తేదీల్లో నిర్వహించే ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన కార్యక్రమానికి ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. లాగుడు బండలు తీసుకొచ్చి వైఎస్సార్ సీపీ రంగులు వేసి సిద్ధం చేశారు. స్టేజీ, గ్రౌండ్‌లు, ఎడ్లు తీసుకొచ్చే వారికి షెడ్‌లు ఏర్పాట్లలో నాయకులు నిమగ్నమయ్యారు. వచ్చిన వారందరికీ భోజనాలు, వసతి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పరిశీలించారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే విజయం



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు

ఒంగోలు టౌన్: సమయం చాలా విలువైంది, ఎవరైతే సమయాన్ని సద్వినియోగం చేసుకుంటారో వారే విజయం సాధిస్తారని విశ్రాంత సబ్ కలెక్టర్ పేరయ్య అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిన్నారులతో పుస్తక పఠనం చేయించారు. చిన్నారులకు కథలు చదివి వినిపించారు. అసూయ జీవితాలను ఏ విధంగా దెబ్బతీస్తుందో వివరించే కథను చదివి పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు. అలాగే సమయం ప్రాధాన్యతను తెలియజేసే కథను పిల్లలతో చదివించి ఆ కథలోని నీతిని వారికి వినిపించారు. సమయాన్ని ఎప్పుడు వృథా చేసుకోరాదని, సోమరితనం వల్ల భవిష్యత్‌తో పాటుగా ఆరోగ్యం కూడా పాడవుతుందని పిల్లలకు తెలియజేశారు. అనంతరం ఉప గ్రంథాలయ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ... పుస్తకాలు నిత్య చైతన్యాన్ని రగలిస్తాయని, పిల్లల్లో ఆలోచనలకు కలిగిస్తాయని చెప్పారు. ఎదిగే చెట్టు లాంటి పిల్లలకు చక్కటి కథలను బోధిస్తే ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని అలవరుచుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె.సంపూర్ణమ్మ, ఎం శ్రీనివాసులు, పి.స్మైలీ తదితరులు పాల్గొన్నారు.

17న రెడ్డి హాస్టల్ పునఃప్రారంభం

ఒంగోలు: స్థానిక మామిడిపాలెంలోని రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్డి హాస్టల్‌ను ఈ నెల 17న పునఃప్రారంభించనున్నట్లు కమిటీ ప్రతినిధి లింగా రామకృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్‌లో ఉచిత వసతి కల్పిస్తామని, సదవకాశాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని రెడ్డి విద్యార్థులు, ఒంగోలు పరిసరాల్లో ఉన్న కాలేజీల్లో చదువుకునే సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9701501123, 9177130004, 9849124543 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హక్కులొచ్చాయ్..



ఏళ్ల తరబడి రైతు కుటుంబాల్లో చీకట్లు నింపిన నిషేధిత భూముల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించింది. దశాబ్దాలుగా చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన సాగు భూములు ప్రభుత్వ రికార్డుల్లో నిషేధిత జాబితాలో చేరిపోయాయి. వీరి కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకున్నారు. యాజమాన్య హక్కులు కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతుల ఆర్థిక స్థితిగతులు మారడంతో పాటు సరికొత్త సంపదను సృష్టించాయి. జిల్లాలో వేలాది మంది రైతులకు ఊరట లభించింది.

- నిషేధిత జాబితా భూములకు మోక్షం
- ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలకు చెక్
- జిల్లాలో వేలాది మంది రైతులకు ఊరట
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఒంగోలు అర్బన్: చిన్న, సన్నకారు రైతులకు చెందిన భూములు ప్రభుత్వ రికార్డుల్లో నిషేధిత భూములుగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా నష్టపోతున్న రైతుల ఇబ్బందులను ప్రభుత్వం తొలగించింది. నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచనలతో జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు వేగవంతంగా చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు భూమిపై కూడా పరిశీలన చేసి నిషేధిత జాబితా నుంచి వేలాది ఎకరాల చుక్కల భూములు, అసైన్‌మెంట్ భూములు, సర్వీస్ ఇనామ్ భూములు, ఎస్సీ కార్పొరేషన్ నుంచి పొందిన భూములకు మోక్షం కల్పించారు. దీంతో సంబంధిత రైతుల భూములు పట్టా భూములుగా చలామణిలోకి రానున్నాయి. ఈ చర్యలతో రైతులకు ప్రభుత్వ పథకాలు అందనున్నాయి.

భూములు ఉన్నా క్రయ విక్రయాలకు అవకాశం లేకపోవడం, ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారు. చివరికి విత్తనాలు, పురుగుమందులు వంటివి కూడా సబ్సిడీలకు అందే పరిస్థితి లేక ఏళ్ల తరబడి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలతో రైతులకు భారీగా ఊరట లభించింది. కేవలం సాగు చేసుకునే భూములకు హక్కు లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా భూములకు కొలతలు వేస్తూ పక్కా హద్దులు నిర్ణయించడంతో పాటు రికార్డులను ఏర్పాటు చేసేలా రీ సర్వే నిర్వహిస్తూనే మరో పక్క నిషేధిత జాబితాలోని భూములకు మోక్షం కల్పిస్తున్నారు. నిషేధిత జాబితాలో ఉన్న మరో 90వేల ఎకరాల భూమిని కూడా పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో 8,056 మంది రైతులకు సంబంధించి 9,371ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములు, 20 ఏళ్లకు పైబడిన ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 2,198 మంది రైతులకు చెందిన 4,156 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అదేవిధంగా పెద్ద సంఖ్యలో 21,479 మంది రైతులకు సంబంధించి 37,615 ఎకరాల చుక్కల భూమికి క్లియరెన్స్ ఇచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు పొందిన వారికి సంబంధించి 1750 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములే కాకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇటీవల జిల్లాలో 838 మంది రైతులకు 954 ఎకరాల భూమిని కొత్తగా అసైన్డ్ చేసి పాస్‌పుస్తకాలు అందచేసి రైతులకు అండగా నిలబడింది ప్రభుత్వం.

9,371 ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములు

1750 ఎకరాల ఎస్సీ కార్పొరేషన్ భూములు

4,156 ఎకరాల ఫ్రీహోల్డ్ అసైన్డ్ భూములు

21,479 మంది రైతులకు సంబంధించి 37,615 ఎకరాల చుక్కల భూములకు క్లియరెన్స్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్తగా **838** రైతులకు **954** ఎకరాల భూమి అసైన్ చేసి పాస్‌పుస్తకాలు అందజేత

ప్రభుత్వ చర్యలతో రైతులకు మేలు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో జిల్లాలో వేలాది రైతులకు మేలు జరుగుతోంది. ఇప్పటికే నిషేధిత జాబితాలో ఉన్న పలు రకాల భూములకు సంబంధించి రికార్డులు పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగించాం. దీని వల్ల రైతులకు భూములపై హక్కు ఏర్పడుతుంది. అంతేకాకుండా పథకాల అందేందుకు మార్గం సుగమమైంది. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే రీ సర్వే చేపట్టింది. ఈ సర్వే ద్వారా భూములకు రక్షణ కలగడంతో పాటు రికార్డులు పక్కాగా ఏర్పడతాయి.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

అసలైన హక్కుదారులకు భూ సమస్యలు తొలగినట్లే



ఎవరికైతే అసైన్‌మెంట్, సర్వీస్ ఇనామ్, ఎస్సీ కార్పొరేషన్ భూములు లభించాయో అటువంటి అసలైన హక్కుదారుల భూములకు ప్రభుత్వ చర్యలతో నిషేధిత జాబితా నుంచి తొలగిపోయి సమస్యలు తీరినట్లే. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పక్కాగా పరిశీలించిన తర్వాతే ఆయా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాం. దీంతో రైతులకు భూములపై పూర్తి హక్కులు ఏర్పడినట్లే. అయితే మ్యుటేషన్, పాస్ పుస్తకాలు వంటి పనుల కోసం మధ్యవర్తులను ఆశ్రయించడం గానీ తహసీల్దార్ కార్యాలయాల్లో మామూళ్లు గానీ ఇవ్వకుండానే చేసుకోవచ్చు. ఈ భూములకు సంబంధించి తహశీల్దార్ కార్యాలయాల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం రైతులకు అండగా నిలబడినట్లు అధికారులు రైతులకు పనిచేయాలి.

– కె.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

దేశానికి దిక్సూచీ బీఆర్ అంబేడ్కర్

- ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరికీ చాటాలనే భారీ విగ్రహ నిర్మాణం
- ఈనెల 19న విగ్రహావిష్కరణకు విజయవాడ తరలిరండి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: దేశానికి దిక్సూచీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జిల్లాస్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 19న విజయవాడలో ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. దేశంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం, అందరికీ అవకాశాలు అనే గొప్ప హక్కులను ప్రసాదించిన అంబేడ్కర్‌కు ఘన నివాళి అర్పించేందుకు ప్రతి గ్రామం నుంచి అంబేడ్కర్ వారసులమైన మనమంతా కదలి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో అంబేడ్కర్ ఘనతను వివరిస్తూ భారీ సంఖ్యలో ప్రజలను ఆహ్వానించాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించిన స్థలం విలువ రూ.2వేల కోట్లు ఉంటుందన్నారు. విగ్రహ నిర్మాణ వ్యయం రూ.400 కోట్ల పైమాటే అన్నారు. కృష్ణానది దాటగానే చూపుడు వేలును చూపిస్తూ ఉండే అంబేడ్కర్ విగ్రహం ప్రతి ఒక్కరిలో ఒక ఉన్నతమైన ఆలోచనలను రేకెత్తిస్తూ పేద, బడుగు, బలహీనవర్గాల్లో స్ఫూర్తిని చాటేలా కనిపిస్తుందన్నారు. ఒడా చైర్మన్ సింగరాజు మీనా వెంకట్రావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ వారికి ప్రత్యేక హక్కులను రాజ్యాంగంలో పొందుపరచడం ద్వారానే నేడు ఆయా సామాజిక వర్గాల అభ్యున్నతికి బాట పడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ అంబేడ్కర్ దేశంలోని ప్రతి ఒక్కరివాడన్నారు. ఆయన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి పాటుపడడమే కాకుండా మహిళాభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ మాట్లాడుతూ సమాజంలో విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని భావించిన మహనీయుడు పూలే అన్నారు. ఆయన చూపిన బాటలోనే నేడు ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురైన పేద ప్రజానీకం అందరికీ నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి నేనున్నానటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసానిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఎక్కడో పొలాల్లో, ముళ్లచెట్లలో అంబేడ్కర్ విగ్రహానికి శంకుస్థాపన చేశారని, కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2వేల కోట్ల విలువైన స్థలాన్ని, అది కూడా విజయవాడ నడిబొడ్డున కేటాయించడం అంబేడ్కర్ అభిమానులుగా మనందరి ఆత్మగౌరవానికి ప్రతీక అని చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవ ప్రసాద్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామ్‌నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం అంబేడ్కర్ విగ్రహం నిర్మించిన స్థలాన్ని వ్యాపారులకు లీజుకు ఇచ్చేందుకు చంద్రబాబు యత్నించారని, కానీ నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఆ ప్రాంతాన్ని అంబేడ్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ గుర్తు చేసేలా కేటాయించడం గర్వకారణమన్నారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు తదితరులు మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రతివార్డులో , ప్రతి గ్రామంలో తెలియజేసి విగ్రహావిష్కరణ పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు.

యోగాతో ఆత్మస్థైర్యం

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల్లో యోగా ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లోని యోగ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. గత 5 నెలలుగా యోగాలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం యోగా చేస్తే విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. భవిష్యత్‌ను నిర్ణయించుకునే సత్తా పెరిగిందని, విద్యార్థులతో మాట్లాడుతుంటే తనకు ఈ విషయం అవగతమవుతుందన్నారు. ఫిబ్రవరి 15న రథసప్తమి సందర్భంగా 3వేల మంది విద్యార్థులతో 108 పర్యాయాల సూర్య నమస్కారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా శిక్షకులు పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సూర్య నమస్కారాల సాధన, సూర్య యజ్ఞం శిక్షణ రాష్ట్రంలో ఒక్క ప్రకాశం జిల్లాలో మాత్రమే నిర్వహిస్తున్నామని, ఈ ఘనత కలెక్టర్ దినేష్‌కుమార్‌కు చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు తాతా ప్రసాద్, కిరణ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



యోగా శిబిరంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



యోగ శిక్షణ పొందుతున్న సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు

క్రికెట్ పండుగ..!

- రేపటి నుంచి రావినూతలలో అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు
- పలు రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 16 జట్లు
- ఎనిమిది రోజుల పాటు క్రికెట్ అభిమానులకు పండుగ



రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ క్రికెట్ స్టేడియం పెవిలియన్



తుదిమెరుగులు దిద్దుకుంటున్న క్రికెట్ పిచ్

మేదరమెట్ల: సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీల సంబరం మొదలు కానుంది. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు 30వ అంతర్‌రాష్ట్ర టీ–20 క్రికెట్ పోటీలు ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరావు తెలిపారు. రావినూతల క్రికెట్ స్టేడియంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మ్యాచ్‌ల వివరాలు వెల్లడించారు. పోటీలను టీ–20 ఫార్మట్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. పోటీల్లో చెన్నై, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 16 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గత 30 ఏళ్ల నుంచి క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. అయితే కరోనా మహమ్మారితో గడచిన మూడేళ్లుగా పోటీలను నిలిపివేశామని, తిరిగి ఈ ఏడాది నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లకు వసతి సౌకర్యంతో పాటు ఇంటి వాతావరణంలో ఏర్పాటు చేసిన భోజన సదుపాలయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ.3 లక్ష నగదు బహుమతి, శ్రీభ్రమర సంక్రాంతి కప్, ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షల నగదు, షీల్డ్, తృతీయ బహుమతిగా రూ.లక్ష నగదు, షీల్డ్‌లను బహుమతులుగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాటర్, బెస్ట్ ఫీల్డర్‌లకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. 9వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్న పోటీలకు ముఖ్య అతిథులుగా భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం చెంచుపున్నయ్య చౌదరి, కార్యక్రమ అధ్యక్షుడిగా ప్రముఖ సినీనటుడు యర్రా రఘుబాబు, టోర్నమెంట్ ప్రారంభకులుగా గళ్లా రామచంద్రరావు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీభ్రమర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్, గౌరవ అతిథులుగా డాక్టర్ బి.జవహర్, ఎస్.మోహన్‌దాస్ పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- ప్రజాసంకల్పవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి

ఒంగోలు సిటీ: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి అన్నారు. ఒంగోలు ప్రజాసంకల్ప వేదిక కార్యాలయంలో 26 జిల్లాల్లోని ఆర్టీఐ సభ్యులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్టీఐ కార్యకర్తలు చట్టపరిధిలో పనిచేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 90 వేల పైచిలుకు సభ్యులంతా ఏకతాటిపై రావాలని, ప్రజలకు మంచి చేకూర్చే ప్రభుత్వ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. చట్టాలపై అవగాహన కల్పిస్తూ భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న వైఎస్సార్ లా నేస్తం పేద న్యాయవాదులకు న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కుల, మత, వర్గ, విభేదాలకు తావు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆంధ్రప్రదేశ్ భూ పరిరక్షణ చట్టం 2023 ద్వారా పెండింగ్‌లో ఉన్న లక్షలాది ఎకరాల భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే లక్షలాది చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరుతుందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా సంకల్ప వేదిక ఆర్టీఐ పరిధిలో ఉన్నటువంటి సభ్యులంతా చట్ట పరిధిలో పనిచేయాలని, చట్టాలను ప్రతి గడపకూ చేరవేయాలని పిలుపునిచ్చారు. సదస్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యవర్గ సభ్యులు హాజరై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఎన్నికల్లో ఆర్టీఐ కార్యకర్తలంతా బలమైన ఓటుబ్యాంకుగా మారి సభ్యులందరి ఏకాభిప్రాయంతో వైఎస్సార్ సీపీకి మద్దతును ఇచ్చి అఖండ మెజారిటీతో గెలిపించేలా అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దారా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవినాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మదిరె రంగసాయిరెడ్డి

క్లుప్తంగా

కరాటే పోటీల్లో మార్కాపురం విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో నిర్వాహకులు

మార్కాపురం: రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈనెల 6న జరిగిన 24వ జాతీయ స్పై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ఎంఎస్ స్పై మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. 3 గ్రూపు గోల్డు మెడల్స్, 3 ఇండివిడ్యువల్ గోల్డు మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్, 2 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఎస్‌కే జోయా సిద్ధికి ముష్కాన్, ఎస్‌కే యాసిన్ బాషాలు గ్రూపు విభాగంలో గోల్డు మెడల్ సాధించినట్లు తెలిపారు. అండర్- 18 విభాగంలో ఎస్. జస్వంత్‌రెడ్డి, పీఎస్ శివ, ఎస్‌కే యాసిన్‌బాషాలు గోల్డు మెడల్ సాధించారన్నారు. వీరికి జమ్మూ కాశ్మీర్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్ మీర్ నజీర్ అహ్మద్, ఇస్మాయిల్ బహుమతులు అందించినట్లు తెలిపారు.

ఎంఈఓ-2 సంఘం జిల్లా అధ్యక్షునిగా రాజాల


నూతన కార్యవర్గ సభ్యులు

పొదిలి: మండల విద్యాశాఖాధికారులు-2 సంఘం జిల్లా అధ్యక్షునిగా రాజాల కొండారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పొదిలిలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గిరిధరశర్మ, కోశాధికారిగా కె.శివాజీ, గౌరవ అధ్యక్షులుగా డి.వెంకారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లుగా సీహెచ్ సుబ్రహ్మణ్యం, డి.రామిరెడ్డి, రమాదేవి, రాజశేఖరరెడ్డి, సహాధ్యక్షునిగా బి.నరసింహారావు, కార్యదర్శులుగా సుబ్బారావు, నాగలక్ష్మి, శ్రీనివాసులు, లక్ష్మీనాయక్, యువీ నారాయణ, టి.బాలాజీ, సుధాకర్‌లు ఎన్నికయ్యారు. ఎంఈఓ-2ల జాబ్ చార్టులో మార్పులు చేయాలని కోరుతూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం ఇవ్వాలని తొలి సమావేశంలో తీర్మానించారు. సమగ్ర శిక్ష కార్యకలాపాలన్నీ ఎంఈఓ-2ల ద్వారా చేయిస్తున్నందున సమగ్ర శిక్ష సిబ్బంది అయిన సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను రెండో ఎంఈఓలకు కేటాయించాలని నూతన కార్యవర్గ సభ్యులు కోరారు.

ఆపన్నులకు అన్నదానం

- సాయి స్ఫూర్తితో జీజీహెచ్‌లో నిత్యాన్నదానం
- రోగులతో పాటు అటెండెంట్స్‌కు విశేష సేవలందిస్తున్న శ్రీ సత్య సాయి ప్రసాద క్యాంటీన్
- కోవిడ్ అనంతరం రెండు పూటలా నిర్వహించేలా ఎమ్మెల్యే బాలినేని చొరవ
- 2020 కోవిడ్ నాటికి సుమారు 4.25 లక్షల మందికి అన్నవితరణ


శ్రీ సత్య సాయి ప్రసాద క్యాంటీన్‌లో భోజనం తింటున్న దృశ్యం

ఒంగోలు టౌన్: అన్ని దానాల్లోకల్లా అన్నదానం శ్రేష్ఠమైనది అంటారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఇలాంటి మహత్తర కార్యక్రమానికి శ్రీ సత్యసాయి ప్రేమ ట్రస్ట్ వారు శ్రీకారం చుట్టి ఆకలిగొన్నవారి ఆకలి తీర్చుతూ బాబా సూక్తులను తూ.చ తప్పక పాటిస్తూ ఆయన ఆశీస్సులు పుష్కలంగా పొందుతున్నారు.

ఒంగోలులోని సర్వజనాసుపత్రి నిత్యం రోగులతో కిటకిట లాడుతుంటుంది. ఏ ఆసరా లేనివారు.. జేబులో చిల్లి గవ్వలేని పేదలకు ఇదే పెద్ద దిక్కు. ఒంట్లో ఎలాంటి సుస్తీ చేసినా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఓపీ తీసుకొని అక్కడ వేలాది రూపాయల ఖర్చు భరించే స్థోమత వీరుకుండదు కదా. అందుకే జీజీహెచ్ అండగా ఉంటుంది. వైద్య చికిత్స ఎలాగూ ఉచితంగా అందుతుంది. మరి ఇన్‌పేషెంట్లుగా ఉండే రోగులు.. వారికి సహాయకులుగా ఉండేవారి ఆకలి ఎలా తీరుతుంది? ఇలాంటి వారి ఆకలిని శ్రీ సత్యసాయి ప్రేమ ట్రస్ట్ గుర్తించింది. జీజీహెచ్ ఆవరణలో శ్రీ సత్యసాయి ప్రసాద క్యాంటీన్ నిర్వహిస్తూ ఉచితంగా భోజన వసతి సమకూర్చుతోంది.

2015లో క్యాంటీన్ ప్రారంభం

శ్రీ సత్యసాయి ట్రస్ట్ ప్రసాద క్యాంటిన్‌ను 2015 డిసెంబరులో ప్రారంభించారు. వైద్య చికిత్స కోసం పేషేంట్‌తో పాటు వచ్చిన వారికి ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు భోజనం పెడతారు. ఇందుకోసం ఉదయాన్నే హాస్పిటల్‌లోని అన్ని వార్డులు తిరిగి టోకెన్లను పంపిణీ చేస్తారు. ఇవి తెచ్చిన వారికి మాత్రమే భోజనం పెడతారు. పచ్చడి, కూర, సాంబారు, మజ్జిగ ఉంటాయి. భక్తుల చందాలతోనే ఈ క్యాంటీన్ నిర్వహిస్తుండటం అభినందనీయం. 2020 కోవిడ్ నాటికి సుమారు 4.25 లక్షల మందికి భోజనం పెట్టడం విశేషం.

అయితే కోవిడ్ విజృంభించిన సమయంలో క్యాంటీన్ నిర్వహిస్తున్న గదిని జీజీహెచ్‌కు అప్పగించాల్సి వచ్చింది. ఇక్కడ కూడా తాత్కాలిక వార్డులు ఏర్పాటు చేసి చికిత్స అందించారు. ఈ క్రమంలో క్యాంటీన్ సేవలను తాత్కాలికంగా నిలిపి వేయాల్సి వచ్చింది.

పునఃప్రారంభం ఇలా..

కోవిడ్ నుంచి విముక్తి లభించిన తర్వాత ఆస్పత్రి ఆధీనంలోనే క్యాంటీన్ గది ఉండి పోయింది. దీంతో ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యే బాలినేనితో భేటీ అయ్యి క్యాంటీన్‌ను పునఃప్రారంభించాలని నిర్ణయించారు. కొద్ది కాలంలోనే పనులు పూర్తి అయిన తర్వాత 2023 ఆగస్టులో బాలినేని శ్రీనివాసరెడ్డి పునః ప్రారంభించారు.

అడగకుండానే సాయం చేసిన బాలినేని

క్యాంటీన్ ప్రారంభోత్సవానికి వచ్చిన బాలినేని ట్రస్టు సేవా నిరతిని అభినందించారు. కేవలం మధ్యాహ్న భోజనం పెడితే పేషెంట్లు ఇబ్బంది పడతారని రెండు పూటలా అందించవచ్చు కదా అని సూచించారు. నిధుల కొరత వలన చేయలేక పోతున్నామని సభ్యులు చెప్పడంతో వెంటనే ఆయన స్పందించారు. ఆ బాధ్యత తాను తీసుకుంటానని ఇక నుంచి రాత్రి పూట ఉపాహారం పెడితే ఎంత ఖర్చయినా భరిస్తానంటూ భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసి 2023 నవంబరు 30న రాత్రి ఉపాహారాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి జీజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లకు ప్రతి రోజూ రెండు పూటలా భోజన వసతి లభిస్తోంది.


భోజనాలు పంపిణీ చేస్తున్న బాబా భక్తులు

రాత్రి పూట మెనూ ఇదే..

పుదీనా రైస్, గోధుమ ఉప్మా, టమోటా రైస్, బొంబాయి రవ్వ ఉప్మా, పులిహోర, కరివేపాకు రైస్, సాంబర్ రైస్, బియ్యం ఉప్మా. వీటిలో ఏదైనా ఒకటి ప్రతిరోజు సిద్ధం చేస్తున్నారు. ఇందులో పచ్చడి, మజ్జిగ కూడా ఇస్తారు. రాత్రి 7 గంటల నుంచి 8.30 గంటల వరకు ఉపాహారం అందుతుంది. రోజుకు 250 మంది నుంచి 300 మంది వరకు ఇక్కడ అన్నదాన సేవలు పొందుతున్నారు.

బాలినేని సహకారం మరిచిపోలేం:



శ్రీసత్యసాయి బాబా బోధనల ప్రకారం ఒంగోలులోని జీజీహెచ్‌లో ఇన్‌పేషెంట్ల కోసం భోజన వసతి ఏర్పాటు చేశాం. 'కులం, మతం అనేది ఒట్టి భ్రమ మాత్రమే, ఉన్నది కేవలం ప్రేమ కులం, మానవ కులం మాత్రమే' అని బాబా చెప్పిన మాటల ప్రకారం ఇక్కడ కులమతాల ప్రసక్తి లేకుండా భోజనాలను పెడుతున్నాం. ఇందు కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇస్తున్న సహకారం ఎప్పటికీ మరచిపోలేం.

– మంత్రి శ్రీరామ మూర్తి, ట్రస్ట్ చైర్మన్

మద్యం సీసాలు పట్టివేత

అక్రమంగా తరలించి విక్రయాలు చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని సుందరయ్య రోడ్డులో నివసిస్తున్న బత్తుల ప్రసన్న ఆంజనేయులు గృహంలో పాండిచ్చేరికి చెందిన మద్యాన్ని విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. పక్కా సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ నేతృత్వంలోని పోలీసుల బృందం ఆంజనేయులు గృహంపై దాడి చేసి చేశారు. సుమారు 40 ఫుల్ బాటిళ్లు సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పాండిచ్చేరి మద్యం

శరవేగంగా పైపులైన్ పనులు

- సమ్మర్ స్టోరేజీగా పొదిలి పెద్ద చెరువు
- పొదిలివాసుల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


పైపులైను వేసేందుకు తీసిన కాలువ


పైపులు అమర్చుతున్న కూలీలు

పొదిలి రూరల్: పట్టణ వాసులకు నీటి సమస్య త్వరలో తీరనుంది. దాదాపు 40 ఏళ్ళ నుంచి ప్రజలు ఎదురు చూస్తున్న పొదిలి పెద్ద చెరువును సమ్మర్ స్టోరేజీగా చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి సాధించారు. దీనికి ప్రభుత్వం నుంచి అనుమతులు ఇవ్వడమే గాక వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇందుకు రూ. 50.13 కోట్ల నిధులు మంజూరు చేసింది. పొదిలికి మంజూరైన వాటరు రిజర్వాయర్ ప్రాజెక్టును మార్కాపురంలోని ఎస్‌వీకేపీ డిగ్రీ కాలేజీలో రెండో విడత వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అక్కడి నుంచే శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. సీఎం జగన్ తన పాదయాత్రలో పొదిలికి వచ్చినప్పుడు ప్రజలు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ప్రస్తుతం పైపులైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పొదిలి నుంచి మల్లవరం వరకు దాదాపు 4 కిలోమీటర్ల పైగా పైపులైన్ పూర్తి చేశారు. మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రూ.50.13 కోట్లతో దర్శి మండలంలోని కొత్తరెడ్డిపాలెం ఎన్‌ఎస్‌పీ కెనాల్ దగ్గర నుంచి అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా పొదిలి పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మార్చి నీరు నింపాల్సి ఉంది. దీనికి 0.22 టీఎంసీల నీరు నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఓబీసీ చానల్ నుంచి పొదిలి పెద్ద చెరువుకు సరఫరా చేస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే పొదిలి పట్టణంతో పాటు శివారు గ్రామాలకు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైనట్లే అని అంత హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఒక చోట నిల్వ ఉంచిన పైపులు

మహానుభావులు నడయాడిన నేల అద్దంకి


భరణిని సన్మానిస్తున్న పుట్టంరాజు బుల్లెయ్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

- తరువోజ పద్య శాసనం ఇక్కడ పుట్టడం గొప్ప విషయం
- జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న తనికెళ్ల భరణి

అద్దంకి: చారిత్రక ప్రసిద్ధి చెందిన అద్దంకి మహానుభావులు నడయాడిన గడ్డ.. ఇక్కడ అణువణువు ఆ శివలింగ స్వరూపమేనని సినీ నటుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి తనికెళ్ల భరణి పేర్కొన్నారు. పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఏర్పాటు చేసిన జీవిత సాఫల్య పురస్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాన్ని అందుకున్నారు. ఈకార్యక్రమం పట్టణంలోని కామేపల్లి కళ్యాణ మంటపంలో ఆదివారం నిర్వహించారు. సభకు డీపీఎం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. శ్రీరామచంద్రమూర్తి కుమారుడు తాండవ కృష్ణ, స్వాగతం పలికారు. వారణాశి రఘురామ శర్మ, ఆర్‌వీ రాఘవరావు తనికెళ్ల భరణి నట పరిచయం గురించి సభికులకు సోదాహరణంగా వివరించారు. వీరవల్లి సుబ్బారావు, జమ్మలమడక హనుమంతరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ భాష మీద, ప్రాంతం మీద సాహిత్యం మీద మక్కువ కలిగిన అద్దంకి రావడం నాకు ఆత్మీయులను కలుసుకున్నంత ఆనందంగా ఉందన్నారు. లక్షలు కాదు ఆత్మీయత అభిమానం కావాలన్నారు. అందుకే అద్దంకికి ఇష్టంగా వచ్చానన్నారు. చారిత్రకంగా గొప్పదైన అద్దంకిలో తరువోజ పద్యశాసనం పుట్టడం గొప్ప విషయం అన్నారు.


పాట పాడుతున్న భరణి

గుండా అవుదాం అనుకున్నా..

భరణి సభికుల నుంచి ప్రశ్నలు అడిగి జవాబు చెప్పే పద్ధతిలో సాగిన ప్రసంగం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. నేను గూండాను అవుదాం అనుకుని రాంగ్ రూట్‌లో నడుస్తున్న నన్ను రాళ్లపల్లి నీవు నడవాల్సిన బాట ఇదిరా అని చెప్పాడు. అప్పటినుంచి ఈ బాటలో నడుస్తున్నాన్నాడు. దేవుడు కోరికలు తీర్చడని, కోరికలు తీర్చుకునే ధైర్యాన్ని ఇస్తాడన్నారు. సినిమాల గురించి చెప్తూ కళాత్మకంగా సినిమా తీయడం చాలా కష్టమన్నారు. అందునా మిథునం వంటి సినిమా తీయడానికి మంచి నిర్మాత అవసరమన్నారు. కథా రచయితలు లేరా అడిగిన ప్రశ్నకు.. లేకేం చాలా మంది ఉన్నారు. కాకపోతే జీవితానికి పనికివచ్చే కథను రాసే వారు లేరన్నారు. రాసే అవకాశం ఇచ్చే వారు లేరన్నారు. స్ఫూర్తినిచ్చే అంశం గురించి చెప్తూ కళాసాగర్ నాటక సంస్థను స్థాపించి దాని ద్వారా నేను రాసిన 'గ్రహణం' నాటకంలో నా నటనను ఆచార్య ఆత్రేయ చూశాడని చెప్పారు. అప్పుడు ఆయన నేను నాటకం రాస్తాను రాస్తాను అని ఇన్నాళ్లు చెప్పాను. ఇక నేను రాయను తనికెళ్ల భరణి రాస్తాడని చెప్పాడన్నారు. అప్పుడే ఆయన పాట రాసి తెచ్చుకున్న రూ.500 పారితోషికం నాకు ఇచ్చాడన్నారు. వాటిలో నాలుగు వందలు వాడేసుకుని ఒక వందపైన ఆత్రేయ పేరు రాసి అలాగే పెట్టుకొన్నానని గుర్తు చేసుకున్నారు. నేటి సినిమాలో ప్రేక్షకుల బలహీనతలను క్యాష్ చేసుకోడమే నేడు ఎక్కువగా జరుగుతోందన్నారు. అయితే నేడూ మంచి సినిమాలు వస్తున్నాయని అటువంటి సినిమాలు తప్పకుండా చూడాలన్నారు. ఇంట్లో ఇల్లాలు బాగులేనప్పుడు వంట చేయడం చాలా ఇష్టమన్నారు. తాను పాడి రికార్డు చేసి ప్రసిద్ధి గాంచిన 'ఆటగదరా శివా, ఈ జన్మకింతేనా మల్లన్నా, నాలోన శివుడు గలడు.. పాటలు పాడి వినిపించాడు. చివరగా ట్రస్ట్ ఆధ్వర్యంలో భరణిని ఘనంగా సన్మానించి ప్రశంస పత్రం అందజేశారు. ఈ సభలో రిటైర్డ్ ఆర్జేడీ యూ దేవపాలన, లెవీ ప్రసాద్, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాపాడితే ఎర్ర బంగారమే!

- సమగ్ర యాజమాన్యంతోనే లాభాలు
- మిరపలో తెగుళ్ల నివారణ, కోతల సమయంలో నాణ్యత పెరగాలి
- జిల్లా ఉద్యానవనశాఖాధికారి గోపిచంద్


పంటలు పరిశీలిస్తున్న దృశ్యం

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో మిరప పంట ప్రధాన వాణిజ్య పంటగా ఉంది. మిరపను ఎర్ర బంగారంగా పిలుస్తారు. దీనికి ప్రపంచ వ్యాప్తంగా మంచి గిరాకీ ఉండటంతో జిల్లాలో ఈ ఏడు 84,900 ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు పలు తెగుళ్ల ఆశించడంతో వాటి నివారణకు, రంగు మారకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై. గోపిచంద్ పలు సూచనలు చేశారు.

తామర పురుగులు (పై ముడుత): రెక్కల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చటం వలన ఆకుల అంచుల వెంబడి పైకి ముడుచుకొంటాయి. ఆకులు, పిందెలు రాగి రంగులోకి మారి పూత, పిందె నిలిచి పోతుంది. నివారణకు లీటరు నీటికి ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఫిప్రొనిల్ 2.మి.లీ లేదా డైఫెన్‌థియోకార్ 1.5 గ్రాముల చొప్పున కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచేలా పిచికారీ చేయాలి. ముందు జాగ్రత్త చర్యగా ఇమిడా క్లోప్రిడ్ మందుతో విత్తన శుద్ధి చెయ్యాలి. రసాయన, సేంద్రియ ఎరువుల సమతుల్యత పాటించాలి.

తెల్లనల్లి (కింది ముడుత): తెల్లనల్లి పురుగులు ఆకుల రసాన్ని పీల్చటం వలన ఆకులు కిందకి ముడుచుకుని తిరగబడిన పడవ ఆకారంలో కనపడతాయి. దీని నివారణకు డైకోఫాల్ 5 మి.లీ లేదా నీళ్లలో కరిగే గంధకం 3 గ్రాములను ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చెయ్యాలి. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు వాడవద్దు. నత్రజని ఎరువులు తగ్గించాలి.

బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు: వాతావరణం మబ్బుగా ఉండి ముసురు వర్షాలు పడినప్పుడు ఈ తెగులు ఎక్కువగా కనపడుతుంది. ఆకులు మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి, ఆకులు పండుబారి రాలి పోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, 1 గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ 10 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి.

కోయినో ఫోరా కొమ్మకుళ్లు తెగులు

కొమ్మలు కణుపుల మధ్య కుళ్లు కనపడి కొమ్మలు విరిగిపోతాయి. లేత చిగుళ్లు మాడిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, 1 గ్రాముల స్ట్రెప్టో సైక్లిన్ 10 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి.

మిరప కోతలు ఇలా..

పంట దిగుబడి అధికంగా పొందటానికి చెట్టుపై పండిన కాయల్ని ఎప్పటికప్పుడు కోసి పట్టలపై కానీ, సిమెంట్ కళ్లాలపై గానీ ఆరబెట్టటం శ్రేష్ఠం. వర్షాధారపు పైరుకు 3 నుంచి 4 కోతలు, నీటి ఆధారపు పైరుకు ఆరు నుంచి ఎనిమిది కోతలు కోయ్యాలి.

ఎగుమతి కోసం మిరప నాణ్యతను పెంచాలి ఇలా..

మొక్కలపై మిరప కాయలను ఎక్కువగా పండనీయ వద్దు. ఎక్కువగా పండితే మిరప నాణ్యత తగ్గుతుంది. పండిన కాయలు ఎప్పటికప్పుడు కోయటం వలన దిగుబడులు పెరుగుతాయి.

కాయ కోసే ముందు సస్యరక్షణ మందులు తరుచుగా పిచికారీ చేయకూడదు. రాత్రుళ్లు మంచు బారిన పండకుండా కాయలను కప్పి ఉంచాలి. మిరపలో పది శాతం మించి ఎక్కువ తేమ ఉండకుండా ఎండ బెట్టాలి. ఎండ బెట్టినప్పుడు దుమ్ము, ధూళి, చెత్త, చెదారం చేరకుండా కాయలు శుభ్రంగా ఉండేలా చూడాలి. కాయలు ఎండబెట్టే దరిదాపుల్లో కుక్కలు, పిల్లులు, కోళ్లు, ఎలుకలు, పంది కొక్కులు రాకుండా చూసుకోవాలి. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తే రంగు, నాణ్యత తగ్గి పోకుండా లాభదామకంగా ఉంటుంది. అకాల వర్షాలకు గురికాకుండా, మంచు బారిన పడకుండా రంగు కోల్పోకుండా ఆధునిక డ్రయ్యర్లలో గానీ లేదా లోబో కో బారన్‌లో గాని ఎండబెట్టి నాణ్యమైన మిరప కాయలను పొందచ్చు.


సస్యరక్షణ చేస్తున్న మిరప పంట

ఆటోడ్రైవర్ నిజాయితీ

- బాధితురాలికి రూ. 6వేల నగదు, రెండు బంగారు చైన్లు అప్పగింత


బాధితురాలికి ఆభరణాలు, నగదు అప్పగిస్తున్న ఎస్సై మాధవరావు

కనిగిరి రూరల్: ఆటో డ్రైవర్ తన నిజాయితీ నిరూపించుకుని అందరి మన్ననలు పొందాడు. మండలం ఏరువారిపల్లికి చెందిన ముంగమూరి లక్ష్మి సుమారు రూ. 6 వేల నగదు, రెండున్నర సవర్ల బంగారు చైను, రెండు సవర్ల పూసల దండ ఉన్న పర్సుతో ఆటో ఎక్కింది. దిగే సమయంలో పర్సు వదిలి దిగి వెళ్లి పోగా డ్రైవర్ వాటిని తెచ్చి ఇచ్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు లక్ష్మి పామూరు మండలం రావిగుంటపల్లి పుట్టి నిల్లు నుంచి అత్తాగారిల్లు అయిన కనిగిరి మండలం ఏరువారిపల్లి వచ్చేందుకు ఆటో ఎక్కి అందులో పర్సు వదిలేసింది. కొద్ది సేపటికి వెంటనే పర్సు పోయిన విషయాన్ని గమనించిన బాధిత మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్సై కె. మాధవరావు, సిబ్బంది వెంటనే సీసీ కెమెరాల ద్వారా ఆటో నెంబర్‌ను కనుగొన్నారు. ఆ ఆటో ప్రతి రోజు పామూరు నుంచి కనిగిరి వైపున ట్రిప్పులు వేస్తోంది. అయితే ఈరోజు చినారికట్లకు బాడుగకు వెళ్లింది. అయితే మార్గ మధ్యంలో ఆటోలో వెనుక సీటులో బాధితురాలికి సంబంధించిన బ్యాగును గమనించాడు. అందులో రూ.6వేల నగదు, బంగారు ఆభరణాలు ఉన్నట్లు ఆటో డ్రైవర్ చెన్నారపు వెంకట రమణ గుర్తించి బ్యాగును నిగిరి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సమక్షంలో బాధితురాలికి అప్పగించాడు. ఈమేరకు బాధితురాల లక్ష్మీ, ఆమె కుటుంబ సభ్యులు సకాలంలో స్పందించిన పోలీసులకు, సహకరించిన డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


బ్యాగులోని నగదు, బంగారు ఆభరణాలు

బాలికపై లైంగిక వేధింపులు

అద్దంకి రూరల్: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై ఆదివారం ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని సాయిబాబా దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న చెన్నుపల్లి రామారావు అనే వ్యక్తి ఇంటి పక్కనే ఉంటున్న మైనర్ బాలికను వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు రామారావుపై ఎస్సై కేసు నమోదు చేశారు.

జేఏసీ జిల్లా నూతన అధ్యక్షునిగా కార్తీక్

ఒంగోలు: ఏపీ విద్యార్థి జేఏసీ నూతన జిల్లా అధ్యక్షునిగా పెట్లూరి కార్తీక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఏపీ విద్యార్థి జేఏసీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ నియామక పత్రాలను అందించారు. ప్రధాన కార్యదర్శిగా పిడతల కరుణాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాము, ఒంగోలు డివిజన్ అధ్యక్షునిగా నరసాపురం శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఓరిగల సూర్య ప్రకాష్, ఉపాధ్యక్షునిగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అవినాష్‌కుమార్, కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, రవికుమార్‌లను నియమించినట్లు జగదీష్ తెలిపారు. ఈనెల 23న ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో 14వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, ఇందులో 14 యూనివర్శిటీలకు సంబంధించిన విద్యార్థులు హాజరవుతారన్నారు. రాష్ట్ర కార్యదర్శి సురేష్, కోటి, అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందిస్తున్న రాయపాటి జగదీష్